సాక్షి
సంగారెడ్డి
బుధవారం ౹ 11 ౹ జనవరి ౹ 2023



మృతదేహాల వద్ద గుమిగూడిన జనాలు

అంతా క్షణాల్లోనే..

రెండు కుటుంబాల్లో అంతులేని శోకం | **మునిగడప వద్ద కారు బోల్తా ఘటనలో ఆరుగురి దుర్మరణం**



గజ్వేల్ ప్రభుత్వాస్పత్రిలో పరిస్థితిని సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, సీపీ శ్వేత



ప్రమాద ఊహా చిత్రం

గజ్వేల్/జగదేవ్‌పూర్: ఎములవాడ రాజన్న దర్శనం చేసుకొని వస్తున్నామనే సంతోషం.. వారిలో కొద్ది గంటలు కూడా నిలవలేదు. మూలమలుపు దాటే వరకు సజావుగానే సాగిన ప్రయాణానికి మృత్యువు కాపుగాసిందన్న విషయం తెలియకుండానే పైలోకాలకు వెళ్లిపోయారు. అతివేగం ఆరుగురి ప్రాణాలను బలిగొన్నది. రెండు కుటుంబాల్లో తీరని విషాదం మిగిల్చింది. యాదాద్రి–భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రానికి చెందిన బొల్లు సమ్మయ్య స్టీల్ సామాన్లు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్య స్రవంతి కూడా చేదోడువాదోడుగా ఉంటుంది. వీరికి కూతురు భవ్య, కుమారుడు కార్తీక్ అలియాస్ లోకేష్ ఉన్నారు. అదే గ్రామంలోని మాంటిస్సోరి పాఠశాలలో భవ్య, ఏడో తరగతి, లోకేష్ 5వ తరగతి చదువుతున్నారు. సమ్మయ్య తన కుటుంబ సభ్యులతో పాటు బొమ్మలరామారం మండలం మల్యాల గ్రామానికి చెందిన అత్తమామ రాజమణి–బిట్టు వెంకటేష్‌తో కలిసి రాజన్న దర్శనం చేసుకున్నాడు. మంగళవారం తిరిగి వస్తుండగా, సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండల పరిధిలోని మునిగడప వద్ద కాల్వలోకి కారు బోల్తా కొట్టిన ఘటనలో మృత్యువాత పడ్డారు.

మూలమలుపు దాటాక..

ప్రమాద ఘటనలో అతివేగం, డ్రైవింగ్‌లో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. గ్రామంలోని ఎల్లమ్మగుడి వద్ద నిజానికి ప్రమాదకరమైన మూలమలుపు ఉంది. సహజంగా అక్కడ ప్రమాదాలు జరగడం పరిపాటి. కానీ ఈ మలుపు దాటిన కొద్ది క్షణాలకే కారు అదుపు తప్పింది. డ్రైవింగ్ చేస్తున్న సమ్మయ్య అజాగ్రత్త వహించాడా? వేరే కారణాలున్నాయా? అనే దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కొండపోచమ్మసాగర్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌పై నిర్మించిన కల్వర్టును ఎడమ వైపున ఢీకొట్టిన కారు, అదుపుతప్పి మరింత వేగంతో కుడి వైపునకు వెళ్లి అక్కడ మట్టిగడ్డను దాటి కెనాల్‌లో పడిపోయింది. ఈ క్రమంలో కెనాల్ పైభాగంలో ఉన్న మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను బలంగా తాకి గుంతలోకి తలకిందులుగా పడిపోయింది. ఆలయాల సందర్శనకు వెళ్లివస్తున్నప్పుడు సహజంగా మధ్యలో ఆగి దావత్‌లు చేసుకోవడం పరిపాటి. అంతేగాకుండా దైవదర్శనం సందర్భంలో నిద్రకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వకపోవడం చూస్తుంటాం. తాజా ప్రమాదంలో ఈ రెండు కారణాలు కూడా ప్రభావం చూపాయా అనే కోణంలో కూడా పోలీసులు అనుమానిస్తున్నారు. ఇవే కాకుండా మృతులు ప్రయాణించిన కారు కండిషన్ సక్రమంగా లేకపోవడం, అందులో ఆరుగురు ఇరుకుగా కూర్చోవడం కూడా ప్రమాదానికి మరో కారణంగా భావిస్తున్నారు. ఈ సంఘటన జరిగిన వెంటనే పారిశుద్ధ్య కార్మికులు గమనించి హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. మృతదేహాలను వెలికి తీయడంలో కీలకంగా వ్యవహరించారు.

రోజువారి కూలీలే..

ప్రమాదంలో మృతి చెందిన వెంకటేష్– రాజమణి దంపతులు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు. కాగా వీరి పూర్వీకులు గ్రామాల్లో భాగవతం ఆడేవారు. వీరు రోజువారి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. రాజమణి గంపలో గాజులు, స్టీల్, ప్లాస్టిక్ సామాన్లు ఇంటింటికి అమ్ముతూ ఉండగా, వెంకటేష్ గ్రామంలో ఎక్కడైన కూలి లభిస్తే వెళ్లేవాడు. లేని పక్షంలో బొమ్మలరామారం మండలంతో పాటు సమీప మండలాల్లో భాగవతం పాటలు పాడుతూ భిక్షాటన చేసేవాడు. అందరితో కలిసిమెలిసి ఉండే ఈ దంపతులు ప్రమాదంలో మృతి చెందడంతో మల్యాల గ్రామస్తులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు.

ఆ ఇంట తీరని శోకం

తల్లిదండ్రులిద్దరినీ కోల్పోవడంతో ఆ కుటుంబ సభ్యుల బాధ వర్ణణాతీతంగా ఉంది. రాజమణి –వెంకటేష్ దంపతులకు స్రవంతి, విజయ కూతుళ్లు, కొడుకు శ్రీకాంత్ ఉన్నారు. పెద్ద కూతురు స్రవంతి కుటుంబమంతా మృతి చెందగా, విజయకు గోదావరిఖని చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. కొడుకు శ్రీకాంత్ ఓ ప్రైవేట్ ఉద్యోగి.


సమ్మయ్య(ఫైల్)


స్రవంతి


భవ్య


కార్తీక్


వెంకటేష్


రాజమణి

కలసిరాని సెంటిమెంట్..

బీబీనగర్‌లోని దాసరి కుటంబాలకు చెందిన వారంతా ప్రతీ ఏడాది వారి ఆరాధ్య దైవమైన వేములవాడ రాజన్న దర్శనానికి వెళ్లడం ఆనవాయితీ. రాజన్నను సోమవారం మాత్రమే దర్శించుకోవడం వీరికి సెంటిమెంట్.

సమ్మయ్య కుటుంబం ఈ సంవత్సరం కూడా సోమవారమే రాజన్న దర్శనానికి వెళ్లగా అనుకోని ప్రమాదం చోటుచేసుకుని తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. ఈ విషయం వారి బంధువులకు తెలియడంతో బీబీనగర్‌లో, బొమ్మలరామారంలోని మాల్యాలలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఫోన్ రాగానే గుండెపగిలింది..



తండ్రి వెంకటేశ్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న కొడుకు శ్రీకాంత్

‘నిన్న మధ్యాహ్నం తర్వాత మా అమ్మనాన్న, బావ, అక్క పిల్లలతో కలిసి వేములవాడ పోయింద్రు. మొక్కులు తీర్చుకొని ఇయ్యాల 12 గంటలకు బయలుదేరుతున్నమని నాకు ఫోన్ చేసి చెప్పింద్రు. సాయంత్రం 4 గంటల తర్వాత జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. మీవాళ్లకు యాక్సిడెంట్ అయ్యిందని చెప్పడంతో ఒక్కటేసారి గుండె పగిలినట్టయింది’. అంటూ మృతుడు వెంకటేష్ కుమారుడు శ్రీకాంత్ రోదించాడు. తన తండ్రిని గజ్వేల్ ఆస్పత్రి నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించే క్రమంలో మాట్లాడారు.



కెనాల్‌లో నుంచి కారును బయటకు తీస్తున్న దృశ్యం

న్యూస్‌రీల్

రోజు విడిచి రోజు పరీక్ష నిర్వహించాలి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): పదో తరగతి విద్యార్థులకు రోజు విడిచి రోజు పరీక్ష నిర్వహించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి పరీక్షలను ఆరు పేపర్లకు కుదించడం ఆహ్వానించదగ్గ విషయం అన్నారు. అయితే ప్రశ్నాపత్రాల్లో అన్నింటికీ జవాబులు రాయాలని నిబంధన పెట్టారని, 30 శాతం చాయిస్ ప్రశ్నలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా విద్యాధికారి రాజేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రోళ్ల మహేశ్, పాండు, సాయి, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

దత్తగిరిలో ముగిసిన శతకవి సమ్మేళనం



మాట్లాడుతున్న ఆశ్రమ పీఠాధిపతి

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న శతకవి సమ్మేళన కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఆశ్రమ పీఠాధిపతి 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్ ఆధ్వర్యంలో దత్తగిరి మహారాజ్ శతజయంతి మహోత్సవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో ఉండాలన్నారు. సంగమేశ్వర డ్యాన్స్ అకాడమీ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ అనసూయ మాత, ఆశ్రమ భావి పీఠాధిపతి డాక్టర్ సిద్దేశ్వర స్వామి, కవులు, ఆధ్యాత్మికవేత్తలు రఘు పంతులు, గంటా మోహన్ రెడ్డి, శేషురావు, మారుతి, కృష్ణారెడ్డి, అంజయ్య, వైదిక పాఠశాల విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ను విజయవంతం చేద్దాం



కలెక్టర్ డాక్టర్ శరత్ | మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: జిల్లాలో ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం సంబంధిత అధికారులతో కంటివెలుగు కార్యక్రమ నిర్వహనపై సమీక్ష నిర్వహించారు. కంటి వెలుగు కార్యక్రమంలో జిల్లాలో 17,11,685 మందికి స్క్రీనింగ్ చేయడానికి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. జిల్లాలోని 647 గ్రామ పంచాయతీలు, 8 మున్సిపాలిటీలలోని 199 వార్డులు, జీహెచ్‌ఎంసీ పరిధిలోని మూడు వార్డుల్లో 854 క్యాంపులను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ క్యాంపులు ఉదయం 9 నుంచి 4 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమ విజయవంతానికి పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఆర్పీలు, మున్సిపల్ కమిషనర్లు, కౌన్సిలర్లు కృషి చేయాలన్నారు. కంటి వెలుగుపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. క్యాంపు లొకేషన్స్, తేదీ, సమయం గురించి వివరాలను ముందస్తుగా ప్రజలకు తెలిసేలా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు. 18 ఏళ్లు పైబడిన వారందరూ కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభివృద్ధికి సహకరించండి

పరిశ్రమలు సీఎస్‌ఆర్ నిధులు అందజేసి జిల్లా అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్ డాక్టర్ శరత్ పరిశ్రమల యాజమాన్యాలను కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాజర్షిషాతో కలిసి జిల్లాలోని క్లస్టర్ 5లో గల వివిధ పరిశ్రమల ప్రతినిధులు, సంబంధిత సీఎస్‌ఆర్ నిధుల జిల్లా పర్యవేక్షణ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టర్నోవర్ ప్రాఫిట్‌లో రెండు శాతం సీఎస్‌ఆర్ కింద నిధులను కలెక్టర్ ఖాతాలో జమ చేయాలని సూచించారు. కంపెనీ యాక్ట్, సీఎస్‌ఆర్ నిబంధనలను విధిగా పాటించాలన్నారు. సీఎస్‌ఆర్ నిధులతో చేపట్టిన పనులు, సమాచారాన్ని జిల్లా అడ్మినిస్ట్రేషన్‌కు ముందుగా తెలియచేసి కలెక్టర్ ఆమోదం తీసుకోవాలన్నారు. ఆయా పరిశ్రమల ఆధ్వర్యంలో జరిగిన పనుల వద్ద కంపెనీ పేరుతో బోర్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

‘బీజేపీని వీడేది లేదు’

జహీరాబాద్ టౌన్: తనను పార్టీ నుంచి పంపడానికి ప్రణాళిక ప్రకారం కుట్ర జరిగిందని గత ఎన్నికల్లో బీజేపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన జంగం గోపి అన్నారు. జహీరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి పార్టీకి పునాదులు వేస్తూ బలోపేతం చేస్తుంటే జిల్లా నాయకత్వానికి మింగుడుపడలేదన్నారు. ఝరాసంగం మండలంలో నిర్వహించిన ప్రజాగోస – బీజేపీ భరోసా కార్యక్రమంలో ప్రొటోకాల్ విషయంలో పార్టీ నాయకులతో వాగ్వివాదం జరిగింది. ఇదే విషయాన్ని జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డిని ప్రశ్నించగా కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. ఇదే అదనుగా చూసుకొని దాడి చేసినట్లు చిత్రీకరించి పార్టీ నుంచి పంపే కుంట్ర చేశారని ఆరోపించారు. పార్టీ నియమించినట్లు చెబుతున్న త్రీమెన్ కమిటీ తనను సంప్రదించకుండా పార్టీ నుంచి బహిష్కరించిందని తెలిపారు. ఇప్పటివరకు తనకు సస్పెండ్ లెటర్ అందలేదన్నారు. జిల్లా అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీకి అమ్ముడుపోయి నియోజకవర్గంలో పార్టీని బలోపేతం కాకుండా చూస్తున్నాడని పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ కూడా తనకు సమయం ఇవ్వడంలేదని, కేంద్ర పెద్దలతో మాట్లాడాతానని చెప్పారు. పది వేల మంది కార్యకర్తలతో కేంద్ర కమిటీకి ఉత్తరాలు పంపుతానని, రెండు వేల మందితో కేంద్ర కార్యాలయం వద్ద నిరసన తెలుపుతానన్నారు. బీజేపీని వీడే ప్రసక్తి లేదని, పార్టీలోనే కొనసాగుతానని స్పష్టం చేశారు.

నీటి విడుదలపై క్షేత్ర పరిశీలన

జోగిపేట(అందోల్): అందోల్ మండల పరిధిలోని సంగుపేట, సాయిబాన్‌పేట గ్రామాల పరిధిలో పంట పొలాలకు సింగూరు నుంచి విడుదల చేసిన జలాలు చేరుకున్నాయా? లేదా అనే విషయాన్ని తెలుసుకునేందుకు అధికారులు గ్రామాల్లో పర్యటించారు. జిల్లా ఇరిగేషన్ ఈఈ మధుసూదన్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ రమాదేవి, ఏఈ మజార్ అలీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగరాజులు మంగళవారం పరిశీలించారు. సాయిబాన్‌పేట పరిధిలో వ్యవసాయ భూములను ఎంపీపీ బాలయ్యతో కలిసి అధికారులు పరిశీలించారు. ఈ యాసంగిలో పంటపొలాలకు సాగునీరు అందించేందుకు సింగూరు నుంచి నీటిని వదిలిన తెలిసిందే. సంగుపేట పెద్ద చెరువులోకి నీరు చేరుతోందని క్షేత్ర పరిశీలను వచ్చిన అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులతో మాట్లాడారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ

హత్నూర(సంగారెడ్డి): ప్రజారోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ప్రత్యేక నిధులు కేటాయించిందని జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి అన్నారు. దౌల్తాబాద్‌కు రూ.56 లక్షలతో మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులకు మంగళవారం ఎమ్మెల్యే మదన్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ఐదు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రూ.1.5 కోట్లు మంజూరయ్యాయన్నారు. శిథిలావస్థలో ఉన్న పీహెచ్‌సీల భవనాల మరమ్మతులకు సైతం నిధులు మంజూరయ్యాయన్నారు. తొమ్మిది నెలల్లో దౌల్తాబాద్ పీహెచ్‌సీ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. అనంతరం కంటి వెలుగు కార్యక్రమంపై వైద్య సిబ్బందితో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి, ఎంపీపీ అధ్యక్షుడు వావిలాల నర్సింలు, జెడ్పీటీసీ ఆంజనేయులు, ఎంపీటీసీలు సతీష్ ఇందిరా, వీరేశం, సర్పంచ్ కొన్యాల వెంకటేశం, వైద్యులు శంకర్, నేత్రావతి, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, పాల్గొన్నారు.

పండగలు సంస్కృతీ సంప్రదాయాలకు నిలయాలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా జరపుకునే సంక్రాంతి పండగ సంస్కృతీ సంప్రదాయాలకు నిలయామని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీంరావుపాటిల్ అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకొని మంగళవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని సీపీఐ కార్యాలయం ఆవరణలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ముగ్గుల పోటీలు నిర్వహించి మహిళలను ప్రోత్సహిస్తున్నామన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన మహిళలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీకేఎంయూ జిల్లా కార్యదర్శి ఎం.తాజొద్దీన్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులడు ఎండీ షఫీ, పార్టీ మండల అధ్యక్షుడు శంకరప్ప, పట్టణ కార్యదర్శి వినోద, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఆర్.లక్ష్మి, నాయకులు రమేష్, ఎం.రాధిక, సంధ్య, బుజ్జమ్మ, పూలమ్మ, అనసూజ, మరియమ్మ, సీహెచ్ సంధ్య, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు



పార్టీలో చేరుతున్న వారికి కండువా కప్పుతున్న మంత్రి హరీశ్‌రావు, తదితరులు

సంగారెడ్డి మున్సిపాలిటీ/కొండాపూర్(సంగారెడ్డి)/సదాశివపేటరూర్(సంగారెడ్డి): తొగర్‌పల్లి ఎంపీటీసీ సంతోష, సంతోష్‌రెడ్డి దంపతులు మంగళవారం సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరితో పాటు లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి మాదవరెడ్డి, సదాశివపేట మండల పరిధిలోని నిజాంపూర్, సూరారం గ్రామాల నుంచి పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారికి మంత్రి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ దేశాభివృద్ధి భారత రాష్ట్ర సమితితోనే సాధ్యమని మంత్రి హరీశ్‌రావు అన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని, దేశంలోనే పార్టీ నిర్ణయాత్మక శక్తిగా క్రియాశీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. సంగారెడ్డిలో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేసేలా కార్యకర్తలు, నాయకులు శ్రమించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్, ఎంపీపీ మనోజ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు విఠల్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, సదాశివపేట ఎంపీపీ తొంట యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన సిద్ధివినాయక ఆలయం



స్వామి దర్శనానికి బారులుతీరిన భక్తులు



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులో స్వయంభూగా వెలసిన సిద్ధివినాయక ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అంగారక చతుర్థిని పురస్కరించుకొని భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి తరలి రావడంతో పరిసరాలు సందడిగా మారాయి. ఏడాదిలో ఒకటి రెండు సార్లు మంగళవారం వచ్చే అంగారక చతుర్థి రోజున స్వామి వారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. సోమవారం అర్ధ రాత్రి నుంచే ఆలయానికి భక్తుల రాక ప్రారంభమైంది. అధిక శాతం భక్తులు కాలినడకన వచ్చి దైవదర్శనం చేసుకున్నారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే కలెక్టర్ డాక్టర్ శరత్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ తదితరులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మహారాష్ట్రకు చెందిన భక్తుల భజనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ట్రస్ట్ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జహీరాబాద్ డీఎస్పీ రఘు ఆధ్వర్యంలో రూరల్ సీఐ వెంకటేశం, హద్నూర్, కోహీర్, రాయికోడ్, ఝరాసంగం, చిరాగ్‌పల్లి, ఎస్‌ఐలు వినయ్‌కుమార్, ఏడు కొండలు, రాజేందర్‌రెడ్డి, కాశీనాథ్‌యాదవ్, పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

దుకాణంలో నగదు అపహరణ


సీసీ ఫుటేజీలో నమోదైన బాలుడి చిత్రం

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణం నుంచి ఓ బాలుడు నగదును అపహరించాడు. దుకాణ యజమాని వెంకటరమణారెడ్డి వివరాల ప్రకారం.. పట్టణంలోని సంగమేశ్వర ఫర్టిలైజర్ షాపులో ఓ కస్టమర్ ఇచ్చిన నగదు రూ.71వేలను కౌంటర్‌పై ఉంచాడు. మరో కస్టమర్‌తో మాట్లాడుతుండగా అక్కడకు వచ్చిన ఓ బాలుడు కౌంటర్‌పై ఉన్న నగదును సినీ ఫక్కీలో చోరీ చేశాడు. దుకాణంలో సీసీ ఫుటేజీని పరిశీలించగా బాలుడు నగదు తీస్తున్నట్లు నమోదైంది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశానని బాధితుడు తెలిపాడు. కేసు నమోదు చేసిన పోలీసులు బాలుడు కనబడితే సమాచారం ఇవ్వాలని సూచించారు. కాగా కొంతకాలంగా గుర్తుతెలియని ముఠా చిన్నారులను సంతలోకి పంపి నగదు, మొబైల్ ఫోన్లను దొంగిలింపజేస్తున్నారని పలువురు తెలిపారు.

108లో మహిళ ప్రసవం


శిశువును అందిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

దుబ్బాక: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవించింది. దౌల్తాబాద్ మండలం దొమ్మాట గ్రామానికి చెందిన గర్భిణి లావణ్యకు మంగళవారం నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. సిబ్బంది అంబులెన్స్‌లో ఆమెను సిద్దిపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో నొప్పులు పెరిగాయి. స్పందించిన ఈఎంటీ భాను ప్రకాశ్, పైలెట్ నర్సింలు ఆమెకు పురుడు పోశారు.

హత్యాయత్నం కేసులో పదేళ్ల జైలు

పటాన్‌చెరు టౌన్: మహిళపై హత్యాయత్నం కేసులో ఓ వ్యక్తికి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి పదేళ్ల జైలు శిక్ష విధించినట్లు సీఐ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బొల్లారం పట్టణ పరిధిలో నివాసం ఉండే బేగరి లక్ష్మయ్య అలియాస్ రమేశ్ 2018 మార్చి 4న కూకట్‌పల్లిలో ఉండే ఓ మహిళను అమీన్‌పూర్ శివారుకు తీసుకువచ్చాడు. డబ్బుల విషయంలో గొడవ జరగగా, కోపంతో రమేశ్ ఆ మహిళ తలపై బండరాయితో మోది, అక్కడ నుంచి పారిపోయాడు. గాయపడిన ఆ మహిళ స్థానికుల సాయంతో ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకుని, పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు సాక్ష్యాలు సేకరించి రమేశ్‌ను మంగళవారం కోర్టులో హాజరుపర్చారు. వాదనల అనంతరం జడ్జి రాధకృష్ణ చౌహాన్ నిందితుడు రమేశ్‌కు పదేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట న్యాయమూర్తి మంగళవారం జరిమానా విధించారు. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ పట్టణంలో పలు చోట్ల నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 15 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిని సిద్దిపేట కోర్టులో మాజరుపర్చగా న్యాయమూర్తి రమేశ్‌బాబు వారికి రూ.33,500 జరిమానా విధించారు.

‘పది’లో ఉత్తీర్ణత శాతం పెంచాలి

రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు సూచించారు. జిల్లా సమీకృత కార్యాలయంలో మంగళవారం టీఎస్ యూటీఎఫ్ నూతన కేలండర్, డైరీని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గతేడాదిలాగే 10వ తరగతి ఫలితాల్లో మరోసారి రాష్ట్రంలో జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని కోరారు. ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ వలీ అహ్మద్, తప్పెట్ల యాదగిరి, రాష్ట్ర కమిటీ సభ్యులు సి.చంద్రారెడ్డి, జిల్లా కోశాధికారి ఎం.కృష్ణ, జిల్లా కార్యదర్శులు జి.వెంకట కిరణ్, కె.కనకరాజు, సభ్యులు కృష్ణ, నర్సింలు, తిరుపతి పాల్గొన్నారు.

మీరే నా నమ్మకం



సిద్దిపేట జోన్: మీరే నా నమ్మకం... జిల్లాలో ప్రభుత్వ వైద్యాన్ని మరింత బలోపేతం చేయడానికి మీ సహకారం కావాలి. ప్రజలకు మెరుగైన సేవలు అందించి బాగా పనిచేయండి.. అని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు వైద్యులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కంటి వెలుగు సమీక్షలో భాగంగా వైద్యులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాకు కొత్తగా నియామకమైన 35 మంది డాక్టర్లను సమావేశంలో అందరికీ పరిచయం చేశారు.

హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

చేగుంట(తూప్రాన్): సీఎస్ సోమేశ్ కుమార్‌పై హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు అని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం చేగుంటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టానికి వ్యతిరేకంగా బీహార్ అధికారుల హవా నడుస్తోందని ఆరోపించారు. సీఎస్ సోమేశ్‌కుమార్ ధరణి వెబ్‌సైట్‌ను తీసుకొచ్చి రైతులను ఇబ్బందులకు గురి చేసారని అన్నారు. స్థానిక ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు ఇవ్వకుండా వేధింపులకు గురిచేశారని అన్నారు. సోమేశ్‌కుమార్‌ను రిలీవ్ చేయాలని కోర్టు తీర్పు ఇచ్చినా, ప్రభుత్వం ఆయనను ఇక్కడే ఉంచేందుకు ప్రయత్నించడం ఏమిటని ప్రశ్నించారు. బీజేపీ మండల అధ్యక్షుడు భూపాల్, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, బీజేవైఎం కన్వీనర్ భాను, గోవింద్, సాయిబాబా, సంతోష్‌రెడ్డి, రఘువీర్‌రావ్, సత్యనారాయణ ఉన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న శ్రీకాంత్

దుబ్బాక: ప్రభుత్వం రవాణా రంగ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రయివేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. రవాణా రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 3న ఖమ్మంలో ప్రారంభమైన సంఘర్షణ యాత్ర మంగళవారం దుబ్బాకకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో సుమారు 20 లక్షల మంది కార్మికులు ట్రాన్స్‌పోర్టు రంగంలో పని చేస్తున్నారని, వారికి సరైన సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దుబ్బాక మండల కేంద్రంలో ఆటో కార్మికుల అడ్డాలకు అనుమతులిచ్చి, ఆటో డ్రైవర్లకు సాయం అందించి ఆదుకోవాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారానికై ఏప్రిల్ 5న చలో ఢిల్లీ చేపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య, కార్యదర్శి రమేష్, నాయకులు గోపాలస్వామి, భాస్కర్, మహేందర్ రెడ్డి, లక్ష్మణ్, మల్లేశం, యాదగిరి, కిషన్, స్వామి, తదితరులున్నారు.

మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేయాలి

తెలంగాణ మంజీర రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీరాజ్


మాట్లాడుతున్న పృథ్వీరాజ్

సదాశివపేట(సంగారెడ్డి): రైతులను సంప్రదించకుండా మాస్టర్ ప్లాన్ తయారు చేయడం ఏమిటని, రైతులకు నష్టం చేకూర్చే మాస్టర్ ప్లాన్‌ను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ మంజీర రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీరాజ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని రైతు సమాఖ్య కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. మాస్టర్ ప్లాన్ పేరుతో రైతుల పచ్చని పొలాలను లాక్కునేందుకు నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటున్న నాయకులు ఆ రైతుల భూములనే తీసుకునేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు. కార్యక్రమంలో మంజీర రైతు సమాఖ్య నాయకులు సంగ్‌శెట్టి, వెంకట్‌రావు, విరన్న, పైతర రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అర్జున్‌రావు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు,

స్మార్ట్‌గా.. సైబర్ మోసం

- జాబ్ అవకాశం అపరిచిత వ్యక్తి మెసేజ్
- రెట్టింపు నగదు అంటూ ఆశ
- రూ.81వేలను పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: జాబ్ ఆఫర్ అంటూ అపరిచిత వ్యక్తి నుంచి వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించిన వ్యక్తి రూ.81వేలను పోగొట్టుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామానికి చెందిన వెంకటేశ్ ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 8న జాబ్ ఆపర్చునిటీ అంటూ తన వాట్సాప్‌కి ఓ అపరిచిత వ్యక్తి నుంచి మెసేజ్ వచ్చింది. మెసేజ్‌ను అనుసరిస్తూ తన వివరాలను నమోదు చేసిన వెంకటేశ్, తొలుత రూ.50 ఇన్వెస్ట్ చేశాడు. అనంతరం రూ.150 తన ఖాతాలోకి వచ్చింది. వెంటనే రూ.1,000 ఇన్వెస్ట్ చేయగా రూ.1,300 వచ్చింది. మరోసారి రూ.3వేలు చేయగా రూ.4,100 వచ్చింది. అయితే ఇన్వెస్ట్ చేసిన నగదు రెట్టింపు అయిన తర్వాత ఒకేసారి డ్రా చేసుకునే అవకాశం ఉంటుందని అపరిచిత వ్యక్తి మెసేజ్‌లో చెప్పడంతో నమ్మిన వెంకటేశ్ రూ.81,000 ఇన్వెస్ట్ చేశాడు. రెట్టింపైన నగదును చెల్లించాలని అడగగా, అటువైపు నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. మోసపోయానని గుర్తించిన వెంకటేశ్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు అదృశ్యమయ్యారు. పటాన్‌చెరులో ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి, తూప్రాన్‌లో మండలంలో కూలీ పనులకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు.

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసులురెడ్డి వివరాల ప్రకారం... పట్టణంలోని ప్రణీత్ పనోరమ కాలనీకి చెందిన దుర్గం వెంకటి(62) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసినవారి వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కూలీ పనులకు వెళ్లి..

తూప్రాన్: కూలీ పనుల కోసం వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన తూప్రాన్ మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ సురేశ్‌కుమార్ వివరాల ప్రకారం.. మండలంలోని నర్సంపల్లి పంచాయతీ పరిధిలోని లింబ్యా తాండకు చెందిన భుక్య గణేశ్(35) హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో అడ్డా కూలీగా పని చేసేవాడు. రెండు, మూడు నెలల పాటు పని చేస్తూ అక్కడే గడిపేవాడు. కాగా రెండు నెలలుగా ఇంటికి రాకపోవడంతో భార్య సరిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాత కక్షలతో హత్యాయత్నం

సంగారెడ్డి టౌన్: పాత కక్షలు మనసులో పెట్టుకొని హత్యాయత్నానికి పాల్పడిన ఘటన సంగారెడ్డి మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం మండలంలోని ఇస్మాయిల్ ఖాన్‌పేట్‌కు చెందిన యాదగిరి సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి ఇంట్లో పడుకున్నాడు. అదే గ్రామానికి చెందిన గోపాల్ గతంలో జరిగిన పాత కక్షలను మనసులో పెట్టుకొని యాదగిరితో పాటు కుటుంబ సభ్యులను చంపేందుకు పథకం వేశాడు. రాత్రి 11.30గంటలకు ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఇంటి నుంచి బయటకు రావడంతో ప్రాణాపాయం తప్పింది. బాధితుడి ఫిర్యాదు మేరకు గోపాల్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులపై ఒత్తిడి తగ్గించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పదో తరగతి పరీక్ష పత్రంలో మార్పులు చేసి విద్యార్థులపై ఒత్తిడి తగ్గించాలని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రెడ్డమైన అరవింద్ కోరారు. మంగళవారం డీఈఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేలా చూడాలని, పరీక్షలను రోజు విడిచి రోజు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్, జిల్లా సహాయ కార్యదర్శి నవీన్, నాయకులు సంతోష్, రాజు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి రిమాండ్

మద్దూరు(హుస్నాబాద్): మూగ దళిత యువతిపై లైంగిక దాడి చేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం చేర్యాల మండలం ఆకునూర్ గ్రామానికి చెందిన బోయిని కనకస్వామి గత నెల 26న మండలంలోని లద్నూర్ గ్రామానికి చెందిన మూగ యువతిపై లైంగిక దాడి చేశాడు. ఘటనపై యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి కనకస్వామిని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో డ్రైవర్ రిమాండ్


ఎరుకలి ప్రవీణ్

పటాన్‌చెరు టౌన్: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపి వ్యక్తి మృతికి కారణమైన ఆటో డ్రైవర్‌ను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండ గ్రామానికి చెందిన మేస్త్రి సయ్యద్ రహమతుల్లా(48) ఆదివారం రాత్రి ఇంద్రేశం సమీపంలో రోడ్డు దాటుతుండగా ఆటో ఢీకొని మృతిచెందిన విషయం తెలిసింది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు ఆటో డ్రైవర్‌ను అదుపులో తీసుకున్నారు. మెదక్ జిల్లా పాపన్నపేట కొత్త లింగయ్యపల్లికి చెందిన ఎరుకలి ప్రవీణ్ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఆటో నడిపినట్లు విచారణలో తేలింది. దీంతో ప్రవీణ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు పేర్కొన్నారు.

ఇసుక డంప్ సీజ్

సిద్దిపేటరూరల్: అనుమతులు లేకుండా డంప్ చేసిన ఇసుకను అధికారులు సీజ్ చేశారు. నారాయణరావుపేట మండలం జక్కాపూర్ శివారులో ప్రభుత్వ భూమిలో అక్రమంగా డంప్ చేసిన ఇసుకను మంగళవారం సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు ఆర్ఐ అఖిలేష్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో వేలం వేస్తామని ఆయన తెలిపారు.

బాలుడి ముందుచూపు


హనీశ్‌తో మేనేజర్ సంజయ్‌తివారి

బెజ్జంకి(సిద్దిపేట): భవిష్యత్‌కు భరోసా కల్పించుకునేందుకు పదేళ్ల చిన్నారి బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి తన ముందుచూపును చాటుకున్నాడు. బెజ్జంకి మండలానికి చెందిన దేవిశెట్టి హనీశ్‌రావు మంగళవారం యూనియన్ బ్యాంక్‌కు వెళ్లి రూ.3వేలను మేనేజర్ సంజయ్‌తివారికి ఇచ్చి ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా మేనేజర్ బాలుడిని వివరాలు అడగగా... తాను ప్రైవేట్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాని, తల్లిదండ్రులు ఇచ్చిన డబ్బులను భవిష్యత్‌లో చదువుకు ఉపయోగపడతాయని డిపాజిట్ చేసేందుకు వచ్చానని తెలిపాడు. బాలుడి తండ్రి సాయి ప్రసాద్‌రావుకు సమాచారమిచ్చిన మేనేజర్ అనంతరం ఆ నగదును డిపాజిట్ చేసి బాలుడికి అందించి, హనీశ్‌ను అభినందించాడు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు చైర్మన్‌ను నియమించాలి

కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం



మాట్లాడుతున్న మాణిక్యం

కొండాపూర్(సంగారెడ్డి): ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు వెంటనే చైర్మన్ నియమించాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడరాఉ. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం అరికట్టాలని, మతోన్మాద శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నిజామాబాద్ జిల్లాలో దళిత టీచర్‌పై దాడి చేసిన వారిపై చర్య తీసుకొని, అట్రాసిటీ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని కోరారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు పెరిగాయని, ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకం, రిజర్వేషన్ల ఎత్తివేత, అట్రాసిటీ చట్టం నిర్వీర్యం, ప్రశ్నించే గొంతులపై దాడి ఘటనలు పెరిగాయని ఆరోపించారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, జిల్లా సహాయ కార్యదర్శి ప్రవీణ్, సభ్యుడు దాస్, నాయకులు మల్లేశం, దత్తు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చదువుకుని ప్రయోజకులు కావాలి

సదాశివపేట ఎంఈఓ అంజయ్య


చిన్నారులను బడిలో చేర్పిస్తున్న ఎంఈఓ అంజయ్య

సదాశివపేట(సంగారెడ్డి): బడికి వెళ్లే వయసులో బిక్షాటన చేయొద్దని, చదువుకుని ప్రయోజకులు కావాలని ఎంఈఓ దండు అంజయ్య సూచించారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో బిక్షాటన చేస్తున్న సిద్దాపూర్ కాలనీకి చెందిన చిన్నారులు దుర్గేష్, మల్లేశ్వరీ, శ్రీశైలంను చేరదీసి సిద్దాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 6 నుంచి 14 ఏళ్ల లోపు బాలలు తప్పనిసరిగా పాఠశాలలో ఉండాలన్నారు. తల్లిదండ్రులకు చదువు విలువ తెలియకపోవడం, ఆర్థిక పరిస్థితుల కారణంగా పిల్లలు బిక్షాటన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి చిన్నారులను పాఠశాలలో చేర్పించి పుస్తకాలు, దుస్తులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్ లైన్ ప్రతినిధులు, హెచ్ఎం సుష్మా, స్రవంతి, అశ్వక్ అహ్మద్, సీఆర్పీలు రాజేశ్వర్, కల్పన ఉన్నారు.

ఘనంగా దర్గా ఉత్సవాలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

కోహీర్(జహీరాబాద్): కోహీర్ పట్టణ శివారు హజ్రత్ సయ్యద్ మౌలానా మొహియోద్దీన్ 764వ జాతర ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యకమంలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ మంత్రి గీతారెడ్డి తదితరులు దర్గాను దర్శించుకొని చాదర్‌ను సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అంతరాష్ట్ర కుస్తీ పోటీలను జహీరాబాద్ డీఎస్పీ రఘు, సీఐ తోట భూపతి ప్రారంభించారు. పోటీల్లో మహారాష్ట్ర, కర్ణాటక నుంచి వచ్చిన మల్లయోధులు సత్తా చాటారు. ఉత్సవ కమిటీ సభ్యులు విజేతలకు నగదు పురస్కారాలు అందజేశారు. సాయంత్రం మురాదాబాద్‌కు చెందిన సనమ్ వార్షి, మురట్‌కు చెందిన గులామ్ వారీస్, సాబ్రీ ప్రదర్శించిన ఖవ్వాలీ కార్యక్రమం ఆకట్టుకుంది.

మిషన్ ఇస్తామని మోసం..

పటాన్‌చెరు టౌన్: పేపర్ ప్లేట్స్ మిషన్ కోసం ఆర్డర్ పెడితే కొరియర్‌లో పాడైన మిషన్ వచ్చిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణంలోని 113 డివిజన్ సీతారాంపూర్ కాలనీకి చెందిన వికాస్ కుమార్ సింగ్ గతేడాది సెప్టెంబర్ 9న పేపర్ ప్లేట్స్ తయారీ మిషన్ కోసం గూగుల్‌లో వెతకగా, ఓ ఫోన్ నంబర్ దొరికింది. ఆ ఫోన్ నంబర్‌కి ఫోన్ చేయగా.. మిషన్‌తో పాటు ప్లేట్స్ తయారీకి ముడి సరుకు కూడా అందిస్తామని, ప్లేట్స్ తయారీ అనంతరం తామే కొనుగోలు చేస్తామని అపరిచిత వ్యక్తి చెప్పాడు. మిషన్ బుకింగ్ చేసుకోవాలని చెప్పడంతో వికాస్ కుమార్‌సింగ్ రూ.25వేలను చెల్లించాడు. బుకింగ్ చేసిన పది రోజుల తర్వాత ఫోన్ చేస్తే మిషన్ కొరియర్‌లో వస్తుందని, మిగతా మొత్తం చెల్లించాలని చెప్పడంతో వికాస్ మిగిలిన లక్షా 75 వేలను చెల్లించాడు. కొరియర్‌ను తెరిచి చూడగా అందులో పనికిరాని మిషన్ ఉండడంతో ఖంగుతిన్నాడు. దీనిపై సదరు వ్యక్తికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయానని గ్రహించి పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


నర్సింలు(ఫైల్)

మెదక్ రూరల్: బాత్రూంలోకి జారిపడి గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన హవేళిఘణాపూర్ మండలం జక్కన్నపేట గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మత్స్యకారుడు శీల నర్సింలు(60) ఈ నెల 7న ఇంట్లో స్నానం చేసేందుకు వెళుతుండగా కాలుజారి కిందపడ్డాడు. ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో కుటుంబీకులు మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మురికి కాల్వలో పడి..

అల్లాదుర్గం(మెదక్): ప్రమాదవశాత్తు మురికి కాల్వలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన అల్లాదుర్గంలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉప్పరి విఠల్(65) సోమవారం అల్లాదుర్గంలోని వారాంతపు సంతకు వెళ్లాడు. తిరిగి రాత్రి ఇంటికి వెళుతుండగా పోచమ్మ ఆలయం ప్రాంతంలో మూత్ర విసర్జనకు వెళ్లి మురికి కాల్వలో పడిపోయాడు. గుర్తించిన స్థానికులు బయటకు తీసి చూడగా అప్పటికే విఠల్ మృతి చెంది ఉన్నాడు. మృతుడి కుమారుడు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు చోట్ల నలుగురి ఆత్మహత్య

వేర్వేరు చోట్ల జరిగిన ఘటనల్లో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. అనారోగ్యంతో కూలీ, చెరువులో దూకి యువకుడు, కడుపునొప్పి భరించలేక గృహిణి, అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు.

అనారోగ్యంతో కూలీ..

చిన్నకోడూరు(సిద్దిపేట): అనారోగ్య కారణంతో జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం చిన్నకోడూర్ మండలం పెద్దకోడూరు గ్రామానికి చెందిన ఆలేటి రాజు(25) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రాజుకు అనారోగ్య సమస్యలు తలెత్తడంతో వైద్యం చేయించుకున్నాడు. అయినా నయం కాకపోవడంతో మానసికంగా కృంగిపోయాడు. మనస్తాపం చెంది ఈ నెల 5న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు సిద్దిపేట జిల్లా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.

చెరువులో దూకి యువకుడు..


నాగరాజు (ఫైల్)

రామాయంపేట(మెదక్): రామాయంపేట పట్టణానికి చెందిన ఓ యువకుడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన దేవుని నాగరాజు (27) స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ వ్యాపార కేంద్రంలో పనిచేస్తున్నాడు. సోమవారం ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతకగా పట్టణ శివారులోని కొచ్చెరువు కట్టవద్ద చెప్పులు కనబడ్డాయి. అనుమానం వచ్చి చెరువులో గాలించగా నాగరాజు మృతదేహం లభ్యమైంది. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఐ రంజిత్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. కాగా నాగరాజు మృతిపై అనుమానాలున్నాయని కుటుంబ సభ్యులు తెలపడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కడుపు నొప్పితో గృహిణి..

రామచంద్రాపురం(పటాన్ చెరు): కడుపునొప్పి భరించలేక గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివారల ప్రకారం.. పట్టణంలోని శ్రీనివాస్ నగర్ కాలనీకి చెందిన అనిత (28) నాలుగు నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతోంది. కడుపునొప్పికి సంబంధించిన ఆపరేషన్ జరిగినా నయం కాలేదు. ఈ క్రమంలో మంగళవారం మరోసారి నొప్పి తీవ్రం కావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని వ్యక్తి..


భాస్కర్‌చారి మృతదేహం

నర్సాపూర్‌రూరల్: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన నర్సాపూర్ పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్ఐ గంగరాజు వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన కమ్మరి భాస్కర్‌చారి(35) సోమవారం అర్ధరాత్రి తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, అప్పుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.